క్లుప్తంగా

బోనాల ఊరేగింపు



నత్నయపల్లిలో బోనాల ఊరేగింపుతో వెళ్తున్న మహిళలు

నర్సాపూర్ రూరల్: మండలంలోని నత్నయ్య పల్లిలో బుధవారం నల్ల పోచమ్మ, దుర్గమ్మ దేవతలకు పెద్ద ఎత్తున మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి సమర్పించారు. ఉదయం అమ్మవార్లకు ఒడి బియ్యం, బట్టలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆయిల్‌పాం ప్లానిటేషన్ ప్రారంభం



మిర్జాపల్లిలో ఆయిల్‌పాం మొక్కలు నాటుతున్న అధికారులు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని మిర్జాపల్లిలో రైతు వీరాంజనేయులు వ్యవసాయ భూమిలో ఆయిల్‌పాం ప్లానిటేషన్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉద్యానవన శాఖ ప్రతినిధి సుజాత మాట్లాడుతూ ఆయిల్‌పాం సాగుతో ఎలాంటి కోతుల బెడద ఉండదన్నారు. నాలుగేళ్ల పాటు అంతర పంటలు వేసుకుంటే ప్రభుత్వం సబ్సిడీ డబ్బులను అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది లక్ష్మి, ప్రవీణ్ ఏఈఓ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐని కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు



నార్సింగి ఎస్‌ఐని కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి ఎస్ఐ సృజనను మండల బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్షుడు కుమ్మరి బాబు మాట్లాడుతూ బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐని మర్యాద పూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఎస్‌ఐని కలిసిన వారిలో నాయకులు ఆకుల మల్లేశం, భూపతిరాజు, గొండస్వామి, బాషానాయక్, రోమాల రాజు తదితరులు ఉన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడిగా సుకుమార్

జహీరాబాద్ టౌన్: వసాయ కార్మిక సంఘం మండల నూతన అధ్యక్షుడిగా ఎస్.సుకుమార్ నియమితులైయ్యారని జిల్లా అధ్యక్షుడుచందర్ తెలిపారు. ఆదివారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. ప్రధాన కార్యదర్శిగా బి.నర్సింలు, ఉపాధ్యక్షుడిగా తుల్జరాం, కొడి నర్సింలు, ఇస్మాయిల్, లిలితమ్మ, సహా కార్యదర్శులుగా పెంటమ్మ, లక్ష్మి, బుద్ధ, చిరంజీవి, లింగం, సంజీవ్, లక్ష్మణ్, కోశాధికారిగా రాజు, సభ్యులుగా నర్సమ్మ, పెంటప్ప, బీరప్ప, సుబ్బమ్మ, రత్నయ్యలు నియమితులైయ్యారు.

27న వివాహ పరిచయ వేదిక

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని షెట్కార్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 27న వీరశైవ లింగాయత్, జంగమ సమాజం వివాహ పరిచయ వేదిక ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు పసారం శ్రీనివాస్ ప్రకటనలో పేర్కొన్నారు. ఉ.10 గంటల నుంచి సా. 4 గంటల వరకు కొనసాగుతుందన్నారు. జిల్లాలోని వీరశైవ లింగయాత్, లింగ బలిజ, జంగమ సమాజంలో పెళ్లి కావాల్సిన వధువరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివాహ పరిచయ వేదికలో పాల్గొనే వారు ఈ నెల 24 లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 92463 59842 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

కేతకీలో ప్రత్యేక పూజలు



ఆత్మచైర్మన్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణకాశిగా ప్రసిద్ధి చెందిన కేతకీ సంగమేశ్వర ఆలయంలో జహీరాబాద్ ఆత్మకమిటీ చైర్మన్ రామలింగారెడ్డి, సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం ఆలయానికి వచ్చిన వారికి ఆలయ అధికారులు, అర్చకులు, పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. పార్వతీ పరమేశ్వరులకు అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి తదితర పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్‌రావు పాటిల్, ఆలయ చైర్మన్ చంద్రశేఖర్ పాటిల్, శంకర్‌పాటిల్ పాల్గొన్నారు.

వరి వైపు.. రైతుల చూపు

- తగ్గిన పంటమార్పిడి
- పెరిగిన వరి, తగ్గిన పత్తి సాగు
- అవగాహన కల్పించామంటున్న వ్యవసాయశాఖ అధికారులు



చందూర్‌లో నాటేసేందుకు నారు తీస్తున్న కూలీలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతులు ఎక్కువగా వరి పంట వైపు మొగ్గు చూపుతున్నారు. అన్ని రకాల పంటల సాగులో ఆరితేరిన రైతులు సైతం.. ఇదే వైఖరి అవలంబిస్తున్నారు. తరచూ వరిసాగు చేయడం మూలంగా భూసారం తగ్గి అధిక దిగుబడి మాట పక్కన ఉంచితే, భవిష్యత్‌తో వరి సాగు చేయడం కూడా కష్టంగా మారుతోందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. చిలప్‌చెడ్ మండలంలో గత వానాకాలం సీజన్‌లో 11 వేల ఎకరాలలో వరి సాగు చేస్తే.. ప్రస్తుత సీజన్‌లో మరో వెయ్యి ఎకరాల వరకు విస్తీర్ణం పెరగనున్నట్లు అధికారుల అంచనా. గత సీజన్‌లో పత్తి సాగు వెయ్యి ఎకరాల పైనే సాగు చేయగా, ప్రస్తుత సీజన్‌లో 700 ఎకరాల వరకే పరిమితమైంది. చిలప్‌చెడ్ మండలం ఎక్కువగా మంజీరా పరివాహక ప్రాంతం ఉండటంతో రైతులు వరి సాగునే ఇష్టపడుతున్నారు. మంజీరా పరివాహక ప్రాంతాలలోని రైతులు గతంలో వరి సాగులో అధిక దిగుబడి సాధించేవారు. అందుకే ఇటువైపు మొగ్గు చూపుతున్నారు. మండలంలో చెరకు, మొక్కజొన్న, చిరుధాన్యాలు, కూరగాయలకు కూడా సారవంతమైన నేలలు ఉన్నప్పటికీ వీటి సాగు తక్కువే. చెరకు పంట సాగుకు సంవత్సర కాలం వ్యవధి, సరైన రవాణా వ్యవస్థ, చుట్టు పక్కల అందుబాటులో చక్కెర పరిశ్రమలు లేకపోవడంతో చెరుకు సాగు తగ్గించామని పలువురు రైతులు చెబుతున్నారు. మండలంలో 15 ఎకరాలలో చెరకు, 15 ఎకరాల వరకు కూరగాయలు సాగు చేస్తున్నారు. స్వల్ప స్థాయిలో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. రైతులు తమ నేలలో భూసార పరీక్షలు చేయించి, నేలకు ఉన్న సారాన్ని ఉపయోగించుకుని, వాటికి తగిన పంటలు వేయాలని, దాంతో రైతన్న వేసిన పంటకు అధిక దిగుబడి సాధించగలరని అధికారులు తెలిపిన రైతులు వారి మాటలను వినడం లేదు.

పంట మార్పిడిపై అవగాహన కల్పించాం



మండలంలోని అన్ని గ్రామాల రైతులకు పంట మార్పిడిపై అవగాహన కల్పించాం. నీటి వనరులు లేని రైతులకు ఆరుతడి పంట సాగు చేయాలని సూచించాం. భూసారాన్ని బట్టి నేలలో ఉన్న పోషకాలను వినియోగించుకొని వాటికి తగ్గ పంటలు సాగు చేయాలని రైతులకు సూచించాం. అధునిక వ్యవసాయంపై సలహాలు ఇచ్చాం. అయినప్పటికీ రైతులు వరి సాగునే ఎంచుకుంటున్నారు.

– రాజశేఖర్ గౌడ్, ఏఓ. చిలప్‌చెడ్

బాలుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

ఎమ్మెల్యే సునీతారెడ్డి



రూప్ల తండాలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): వీధి కుక్కల దాడిలో బాలుడు మృతి చెందడం బాధాకరమని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మండల పరిధి రూప్ల తండాలో నాలుగు రోజుల క్రితం కుక్కల దాడిలో మృతిచెందిన బాలుడు నితిన్ కుటుంబాన్ని సోమవారం ఎమ్మెల్యే పరామర్శించి ఆర్థిక సహాయం చేశారు. జిల్లా పంచాయతీ అధికారితో ఫోన్ మాట్లాడి గ్రామాల్లో విచ్చలవిడిగా సంచరిస్తున్న కుక్కల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి వివరించారు. వీటి నివారణకు చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఆర్థికసాయం చేయాలని డిమాండ్ చేశారు. శివ్వంపేటకు చెందిన కొండల్‌రావు, భాస్కర్‌రావు తల్లి రాములమ్మ మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, మన్సూర్, శ్రీనివాస్‌గౌడ్, చింత స్వామి, లక్ష్మీనర్సయ్య, వెంకట్ రెడ్డి, శేఖర్‌గౌడ్, కిషన్, రూప్ల, తదితరులు ఉన్నారు.

వికలాంగులకు పెన్షన్ పెంచాలి

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి



శివ్వంపేటలో ఎమ్మార్పీఎస్ సమావేశం

శివ్వంపేట(నర్సాపూర్): కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి, ఉపాధ్యక్షుడు యెల్లేష్ డిమాండ్ చేశారు. సోమవారం శివ్వంపేటలో వికలాంగులతో సమావేశం నిర్వహించారు. వికలాంగులకు పెన్షన్ పెంచుతామని చెప్పిన ప్రభుత్వం.. నేటికీ పట్టించుకోవడం లేదన్నారు. వికలాంగులతో పాటు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్న ప్రభుత్వంపై ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. వికలాంగుల పెన్షన్ పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మెదక్‌లో తలపెట్టిన ఆందోళన కార్యక్రమానికి వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ వస్తున్నారని వికలాంగులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

పేద విద్యార్థులకు అండగా ఉంటాం

నేచర్ ఐకాన్ యూత్ ప్రకటన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నేచర్ ఐకాన్ యూత్ సభ్యులు

మనోహరాబాద్(తూప్రాన్): ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల భవిష్యత్‌కు నేచర్ ఐకాన్ యూత్ అండగా ఉంటుందని సంఘం సభ్యులు విద్యార్థులకు సోమవారం సూచించారు. మండలంలోని కూచారం గ్రామానికి చెందిన యూత్ సభ్యులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. జీఎమ్మార్ ఫౌండేషన్ సహకారంతో వారికి అవసరమైన మెటీరియల్ ఇప్పిస్తామని, విద్యార్థికి పాఠశాల ముగిసిన అనంతరం ఆన్‌లైన్ ట్యూషన్‌లు చెబుతామని, గణితం, సైన్స్ సబ్జెక్టులలో పట్టు సాధించి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.

పైతరలో బందోబస్తు

కొల్చారం(నర్సాపూర్): కొల్చారం పైతర గ్రామంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈనెల 14న మండలంలోని చిన్న ఘనాపూర్ శివారు విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు ఇదే గ్రామానికి చెందిన మరెల్లి అనిల్ కాల్పుల్లో మృతి చెందిన విషయం విదితమే. ఈ హత్య కేసులో పోలీసులు సోమవారం నిందితుల అరెస్టును చూపించారు. నిందితులు చుట్టుపక్కల గ్రామాల వారు కావడం, అందులో ముగ్గురు మండలంలోని రంగంపేటకు చెందిన వారు ఉండటంతో చర్చనీయాంశంగా మారింది.

పోటాపోటీగా ఎన్నికలు

పటాన్‌చెరు: మండల పరిధిలోని ఇంద్రేశం గ్రామపంచాయతీ పీఎస్‌ఆర్ టౌన్ షిప్ కమిటీ అధ్యక్షుడిగా జి నాగరాజు ఎన్నికయ్యారు. అధ్యక్ష స్థానానికి ఇద్దరు వ్యక్తులు పోటీ చేశారు. మొత్తం 866 సభ్యులు ఉండగా 702 ఓట్లు పోలయ్యాయి, మొదటి అభ్యర్థి అయినా నాగరాజుకు 420 ఓట్లు నమోదు కాగా, రెండు అభ్యర్థి అయిన మురళి కి 270 ఓట్లు పడ్డాయి.18 ఓట్లు చెల్లని గా నమోదు అయ్యాయి. 150 ఓట్ల ఆధిక్యంతో నాగరాజు విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ... తన గెలుపుకు కృషి చేసిన సభ్యులందరికీ ధన్యవాదాలు చెప్పారు. టౌన్ షిప్‌లో నివసించే సభ్యులందరికి అందుబాటులో ఉంటూ వారి సహకారంతో కాలనీ అభివృద్ధికి కృషి చేస్తా అన్నారు.

మొక్కజొన్న పంటలకు మొగి పురుగు



మొక్కజొన్న పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి

చేగుంట(తూప్రాన్): గ్రామాల్లో మొక్కజొన్న పంటలకు మొగి పురుగు ఆశించి పంటలకు నష్టం చేస్తుంది. పలు గ్రామాల్లోని వివిధ దశల్లో ఉన్న మొక్కజొన్న పంటలకు మొగి పురుగు ఆశిస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. రైతుల సమాచారంతో పలు గ్రామాల్లో మండల వ్యయసాయ అధికారి హరిప్రసాద్ మొక్కజొన్న పంటలను పరిశీలించి మొక్కజొన్నకు మొగి పురగు ఆశించినట్లు గుర్తించినట్లు తెలిపారు. మొగి పురుగు నివారణ కోసం కార్బోఫ్యూరాన్ గుళికలు లేదా థయోడీకార్బ్, క్లోరిఫైరీపాస్, ఫినాల్‌పాస్ మందులను ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేస్తే మొగి పురుగు నివారణ జరుగుతుందని ఏఓ తెలిపారు. జీవ నియంత్రణగా కందిరీగలు మొగి పురుగు గుడ్లపై దాడి చేసి పొదగకుండా నిరోధకాలుగా పని చేస్తాయని తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని కూచన్‌పల్లి జెడ్పీ హైస్కూల్ 1993–94బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని హవేళిఘణాపూర్‌లోని ఓ ఫంక్షన్ హాలులో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమ చిన్న తనంలో చదువుకున్న పాత జ్ఞాపకాల నెమరేసుకుంటూ ఉల్లాసంగా, ఉత్సాహంగా ఆట పాటలతో ఆనందంగా జరుపుకొన్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్, ఏగొండ, గోవర్ధన్‌చారి, వెంకటేశ్, సిద్ధిరాములు, సాయాగౌడ్, నరేందర్‌రెడ్డి, సురేష్‌గౌడ్, ఖాజామియా, గోపాల్, కిష్టాగౌడ్, పద్మారావు, సరిత, ప్రభావతి, సరస్వతి, దత్తమ్మ, సునీత పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

నేడు టేక్మాల్‌లో ఉర్సు ఉత్సవాలు



ముస్తాబైన దర్గా

టేక్మాల్(మెదక్): హజ్రత్ సయ్యద్ సాహెబ్ హుస్సేని ఖాద్రీ చిస్తీ రహెమతుల్లా అలై ఉర్సు ఉత్సవాలు కేంద్రమైన టేక్మాల్‌లో మంగళవారం నుంచి ప్రారంభం కానున్నట్లు కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు షేక్ మజహర్ తెలిపారు. ఈఉత్సవాలు దర్గా పీఠాధిపతి సయ్యద్ షా అహ్మద్ నూరుల్లా హుస్సేనీ ఖాద్రీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా గ్రామంలో కిందివాడ నుంచి గ్రంథం, చాదర్‌ని ప్రత్యేక ప్రార్థనలతో ఊరేగింపుగా తీసుకొచ్చి దర్గాలో సమర్పిస్తారని తెలిపారు. దర్గాను రంగురంగుల దీపాలతో అందంగా అలంకరిచామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



ఎండ్ల బండ్ల ప్రదక్షిణల సమయంలో కిక్కిరిసిన భక్తులు

బోనం.. ఘనం



బోనం ఎత్తుకున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: పట్టణంలో సోమవారం బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. నల్లపోచమ్మ, భూలక్ష్మమ్మ, దుర్గామాత ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. కాలనీల వారీగా బోనాలు సమర్పించారు. ఎండ్ల బండ్లను ప్రత్యేకంగా అలంకరించి రాత్రి ఊరేగింపుగా నల్లపోచమ్మ ఆలయానికి వచ్చి ప్రదక్షిణలు చేశారు. ఆయా ఆలయాల్లో స్థానిక జూనియర్ సివిల్ జడ్జి హేమలత దేవతలకు పూజలు చేశారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి పట్టణంలోని 15వ వార్డులోని అమ్మవారి గుడి వద్ద బోనం ఎత్తుకుని మాతకు సమర్పించారు. ఇతర ఆలయాల్లో, ఫలహారం బండ్ల వద్ద తమ పార్టీ నాయకులతో వెళ్లి పూజలు చేశారు. కాగా డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డిలు తమ పార్టీ నాయకులతో వెళ్లి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కాగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్ దేవతలకు పూజలు చేశారు.

ఆరోగ్య భవనం.. పునాదులకే పరిమితం

- ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ముందుకు సాగని పనులు
- ఇది ఆరోగ్య మంత్రి ఇలాకాలో దుస్థితి



ముస్లాపూర్‌లో పిల్లర్ల వరకే పరిమితమైన ఆరోగ్య ఉప కేంద్ర భవన నిర్మాణం పనులు

అల్లాదుర్గం(మెదక్): ఆరోగ్య ఉప కేంద్రం భవన నిర్మాణం పనులు నత్తనడక సాగుతున్నాయి. నిధులు మంజూరై నాలుగు నెలలు గడుస్తున్నా.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల ఆలసత్వంతో పనులకు గ్రహణం పట్టింది. మంత్రి ఇలకాలోనే భవన నిర్మాణం పనులు ముందుకు సాగక పోవడంతో, అధికారుల నిర్లక్ష్యానికి అద్దంపడుతుందనే విమర్శలు వస్తున్నాయి. అల్లాదుర్గం మండలం ముస్లాపూర్ ఆరోగ్య ఉప కేంద్రం అద్దె భవనంలో అరకొర వసతులతో కొనసాగుతోంది. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయంపై స్థానిక కాంగ్రెస్ నేతలు ఆరోగ్య ఉప కేంద్రం దుస్థితిపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి.. ఆరోగ్య ఉప కేంద్రం భవన నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేశారు. అయితే.. కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి నాలుగు నెలలు గడిచినా పిల్లర్ల వరకే చేసి నిలిపివేశారని స్థానికులు చెప్పారు. రెండు నెలల వరకు పునాదుల గుంతలు తీసి వదిలి వేశారని, మరో రెండు నెలలకు పిల్లర్లు సగం తీసి వదిలి వేసినట్లు స్థానికులు తెలిపారు. కాంట్రాక్టర్ పనులు నిలిపివేసినా సంబంధిత పంచాయతీరాజ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని వారు విమర్శిస్తున్నారు. కాంట్రాక్టర్‌తో పనులు చేయించాల్సిన అధికారులు తమకేమి సంబంధం లేదనే ధోరణితో వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. కొందరు సిబ్బంది కాంట్రాక్టర్ ఇచ్చే పర్సంటేజీలకు కక్కుర్తి పడి భవన నిర్మాణం పనుల వైపు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మంత్రి నియోజక వర్గంలోనే అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంపై మంత్రికి వివరిస్తామని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు రోగుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని భవనం తొందరగా పూర్తి చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

బోరుమోటారు బహూకరణ

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ మండలం తిమ్మానగర్ గ్రామ వేణుగోపాలస్వామి దేవాలయం వద్ద భక్తుల సౌకర్యార్థం బొల్లారం గ్రామానికి చెందిన బెండె రమేశ్ తన సొంత డబ్బులతో బోరు వేయించి మోటార్ బిగించి సోమవారం ప్రారంభించారు. సేవాభావంతో ముందుకు వచ్చి సహకరించినందుకు రమేశ్‌కు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

బోనస్ డబ్బులను వెంటనే చెల్లించాలి

చిన్నశంకరంపేట(మెదక్): సన్న వడ్ల బోనస్ డబ్బులు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు రాజు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే సన్నవడ్లకు బోనస్ డబ్బులను చెల్లిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చి ఇంతవరకు అమలు చేయలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు న్యాయం చేయకుంటే బీజేపీ తరపున నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు సురేష్‌గౌడ్, మండల నాయకులు రాజు, శివశంకర్, మధు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులు సమర్పించిన చీరల వేలం

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంలోని మహంకాళి దేవాలయంలో బోనాల సందర్భంగా భక్తులు సమర్పించిన చీరలను సోమవారం వేలం వేశారు. గ్రామంలోని పేదలకు తక్కువ ధరకు చీరలు ఇవ్వాలని వంద రూపాయలకు ఒక చీర చొప్పున విక్రయించగా రూ.19, 900 వచ్చాయి. మధ్యాహ్నం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో తాపీ మేస్త్రీల సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఎమ్మెల్యే, కార్పొరేటర్‌కి ఆహ్వానం

పటాన్‌చెరు టౌన్: ఫలహారం బండి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నిర్వహించే ఫలహారం బండి ఊరేగింపుకి రావాలని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్‌కి నిర్వాహకులు సోమవారం ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మంగళవారం సాయంత్రం పటాన్‌చెరు పాత మార్కెట్ నుంచి ఏడు పోచమ్మల దేవస్థానం వరకు ఊరేగింపు ఉంటుందన్నారు.

నేడు మహంకాళి ఆలయ వార్షికోత్సవం

జహీరాబాద్ టౌన్: పట్టణ సమీపంలో మొగుడంపల్లి చౌరస్తాలోని ప్రసిద్ధ మహంకాళి దేవాలయం 26వ వార్షికోత్సవం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ప్రధాన పూజారి రాజన్న తెలిపారు. ఈ సందర్భంగా 22న బోనాలు, రంగం ఉంటుందన్నారు. 23న అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకం, బలిపూజ తీర్థప్రసాదాలు, అన్నదాన వితరణ, భక్తీ గీతాలపాన, భజనలు, కీర్తనలు, సంస్కృతి కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

ఘనంగా బోనాల జాతర



తూప్రాన్‌లో భక్తులతో కిటకిటలాడుతున్న మహంకాళి అమ్మవారి ఆలయ పరిసరాలు



భవిష్యవాణి వినిపిస్తున్న జోగిని సుజాత

తూప్రాన్: పట్టణ కేంద్రంలో రెండో రోజు సోమవారం బోనాల జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అనంతరం జోగిని సుజాత అమ్మవారి భవిష్యవాణి వినిపించారు. అనంతరం కుంబగావును ఏర్పుల రాంప్రసాద్, లింగగావు పోతరాజు శరత్ చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు పట్టణ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. అలాగే యువత అమ్మవారికి తొట్టెలు ప్రత్యేక బ్యాండ్ మేళాలతో ఫలహారం బండ్లతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి,
జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. లక్ష్మణ్
9502735264